navajyothidaily.com

# నవజ్యోతి

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఆదివారం 30 ఆగస్టు 2026 | ఎడిటర్ : మన్నె లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 308 | పేజీలు : 8 | వేల : 5/-

## ఓటర్ల జాబితా సవరణపై సీఎం కీలక లేఖ

- అర్హుల పేర్లు తొలగిపోకూడదన్న సూచన
- ఫిర్యాదుల గడువు పొడిగించాలని విజ్ఞప్తి
- పట్టణ ఓటర్ల ఇబ్బందులపై ఆందోళన
- ఎన్నికల సంఘానికి సహకారం అందిస్తామన్న ప్రభుత్వం

2



## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

- ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ సీఎంకు కీలక బాధ్యత
- రాజకీయ అనుభవానికి గుర్తింపుగా నియామకం
- రాష్ట్రపతి ఉత్తర్వులతో నియామక ప్రకటన
- పలువురు నేతల అభినందనలు



2

## చిన్న నీటిపారుదల వ్యవస్థపై కీలక నివేదిక

- ముఖ్యమంత్రికి నివేదిక అందజేసిన రైతు కమిషన్
- చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం ప్రతిపాదన
- నీటి వినియోగ సామర్థ్య పెంపుపై దృష్టి
- పంటల మార్పిడి, ఎఫ్‌పీవోల ఏర్పాటుపై సీఎం సూచనలు



**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను బలోపేతం చేసి నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే దిశగా తెలంగాణ వ్యవసాయ–రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి శనివారం అందజేశారు. కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నివేదిక సమర్పించింది. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, నీటి భద్రత, గ్రామీణ జీవనోపాధుల మెరుగుదలకు చిన్న నీటిపారుదల వ్యవస్థ పునరుద్ధరణ అత్యంత అవసరమని నివేదికలో పేర్కొన్నారు. (తరువాయి 2లో)

## తెలంగాణ–మారిషస్ సహకారానికి కొత్త ఊపు

- మంత్రి శ్రీధర్ బాబుతో మారిషస్ మంత్రి భేటీ
- ఐటీ, టూరిజం, విద్యా రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ
- నైపుణ్యాభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై ఆసక్తి
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం



**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ మంత్రి లుచ్‌మనన్ పెంతియా శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ–మారిషస్ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఉన్న అవకాశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. పరిపాలన, టూరిజం, ఐటీ, ఐటీఈఎస్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలు, నైపుణ్యాభివృద్ధి, విద్య వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. సమావేశంలో మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియా మాట్లాడుతూ, స్వల్పకాలంలోనే అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధించిన తెలంగాణను తమ దేశం విశ్వసనీయ భాగస్వామిగా భావిస్తోందని పేర్కొన్నారు.ముఖ్యంగా సాంకేతికత ఆధారిత పరిపాలన, పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్య శిక్షణ రంగాల్లో తెలంగాణ సాధించిన పురోగతి తమకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. (తరువాయి 2లో)



## గాంధీభవన్‌లో ఓబీసీ కులగణనపై సమావేశం

- సామాజిక న్యాయం, ప్రాతినిధ్యంపై చర్చ

**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కార్యాలయం గాంధీభవన్‌లో శనివారం ఓబీసీ కులగణన అంశంపై సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సాధికారత, కులగణన ప్రాధాన్యత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కంచె ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో వెనుకబడిన వర్గాల వాస్తవ పరిస్థితులను అంచనా వేయడంలో కులగణన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో ఖచ్చితమైన గణాంకాల అవసరాన్ని వివరించారు. (తరువాయి 2లో)

## టిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ పనులపై సమీక్ష

- ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో సమావేశం
- నిర్మాణ పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష
- పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు
- ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలని సూచన



**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైద్య మౌలిక సదుపాయాల బలోపేతానికి కీలకమైన ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సమావేశంలో ఆయా ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులు మంత్రికి వివరాలు అందజేశారు. (తరువాయి 2లో)



## మారిషస్‌లో తెలుగు సంస్కృతి ప్రోత్సాహానికి సహకారం

- మారిషస్ ప్రతినిధి బృందంతో భట్టి విక్రమార్క భేటీ
- తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణపై చర్చ
- రామ భజనం కార్యక్రమానికి తెలంగాణ మద్దతు
- ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాల బలోపేతం

2

## జగన్‌కు మరోసారి లోకేష్ సవాల్

- చర్చకు సిద్ధమా అంటూ ప్రశ్న
- వైసీపీపై విమర్శల వెల్లువ
- ఒంగోలులో టీడీపీ కార్యకర్తల సమావేశం
- కార్యకర్తలకు ఐక్యతా పిలుపు

3



## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

- కేటీఆర్ పిలుపుతో జిల్లాల్లో కార్యాచరణ ప్రారంభం
- మేడ్చల్‌లో శంబీపూర్ రాజు నేతృత్వంలో కీలక సమావేశం
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- స్థానిక సమస్యలపై పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం

2



## సీఐ సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ విమర్శలు

- కొండా సురేఖ ఓఎస్డీ వ్యవహారంపై ప్రశ్నలు
- ఉన్నతాధికారుల పాత్రపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు
- ఏసీపీ, డీసీపీలపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్న
- ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ ఆగ్రహం

3



## సీబీజీ ధరల సవరణపై కేంద్రం వివరణ

- వినియోగదారులపై భారీ భారం కాదని స్పష్టీకరణ
- ఉత్పత్తిదారులకు స్థిరమైన ధరల మద్దతు
- గోబర్ధన్ పథకం కింద కొత్త ధర విధానం
- ప్రభుత్వ సబ్సిడీతో వినియోగదారులకు రక్షణ

3



నవజ్యోతి తెలుగు దినపత్రిక navajyothidaily.com

# మారిషస్‌లో తెలుగు సంస్కృతి ప్రోత్సాహానికి సహకారం

- మారిషస్ ప్రతినిధి బృందంతో భట్టి విక్రమార్క భేటీ
- తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణపై చర్చ
- రామ భజనం కార్యక్రమానికి తెలంగాణ మద్దతు
- ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాల బలోపేతం



**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాల ప్రచారం, పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనారాజ్ పెంటియా నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ–మారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య ఉన్న స్నేహపూర్వక బంధాలు ఇరు ప్రాంతాలను మరింత దగ్గర చేశాయని అన్నారు. ముఖ్యంగా తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషస్‌తో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని వివరించారు. మారిషస్‌లో నివసిస్తున్న తెలుగు సమాజం అక్కడి బహుళ సాంస్కృతిక సమాజంలో కీలక పాత్ర పోషిస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలుగు భాష, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు అక్కడి తెలుగు సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలతో సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. మారిషస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రామ భజనం కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాషాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా మారిషస్ మంత్రి లచ్మనారాజ్ పెంటియా మాట్లాడుతూ మారిషస్‌లోని తెలుగు కల్చరల్ సెంటర్ ద్వారా లక్షలాది మంది తెలుగు ప్రవాసులు తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటున్నారని చెప్పారు. తెలుగు వారసత్వాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారం తమకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష, సంస్కృతిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మారిషస్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. తెలుగు ప్రవాసుల అభ్యున్నతి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. ఈ భేటీతో తెలంగాణ–మారిషస్ మధ్య సాంస్కృతిక, విద్యా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఇరు పక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

### తెలంగాణ–మారిషస్
## సహకారానికి కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)



**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** ఇరు ప్రాంతాల మధ్య సన్నిహిత సహకారం పరస్పర ప్రయోజనాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాభివృద్ధి కోసం ఆధునిక పరిపాలనా విధానాలపై శిక్షణ అందించడంలో తెలంగాణ సహకారం కోరారు. రాష్ట్రంలోని ఎంసీహెచ్‌ఆర్డీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రముఖ విద్యా, శిక్షణా సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరచుకోవాలనే ఆసక్తిని వ్యక్తం చేశారు. ప్రజా పరిపాలనలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో తెలంగాణ అనుభవాన్ని పంచుకోవాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, అన్ని రంగాల్లోనూ మారిషస్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇరు ప్రాంతాల మధ్య విద్య, పరిశ్రమలు, టూరిజం, సమాచార సాంకేతిక రంగాల్లో మరింత బలమైన సంబంధాలు ఏర్పడే అవకాశాలపై కూడా చర్చించారు. పరస్పర సహకారంతో కొత్త అవకాశాలను అన్వేషించి, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి నమూనాలు, డిజిటల్ పరిపాలన విధానాలపై మారిషస్ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తి కనబరిచినట్లు అధికారులు తెలిపారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026"లో పాల్గొనాలని మంత్రి శ్రీధర్ బాబు, మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియాను ఆహ్వానించారు. ఈ సమావేశంలో సెక్రటరీ ఫర్ పబ్లిక్ సర్వీస్ దేవేంద్ర గోపాల్, ఏఐపీఎస్ఐ బోర్డ్ చైర్‌పర్సన్ డాక్టర్ నికోలస్ రాగోడూ, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ దుర్బరీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## చిన్న నీటిపారుదల వ్యవస్థపై కీలక నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** కమిషన్ ప్రతినిధి బృందంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, భవానిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కమిషన్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో విస్తృతంగా చర్చించారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాలను ప్రోత్సహించడంతో పాటు ఉద్యానవన పంటల సాగును పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవోలు) ఏర్పాటుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. చిన్న నీటిపారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను అనుసంధానించి నీటి వినియోగాన్ని సమగ్రంగా నిర్వహించే విధానాలను అమలు చేయాలని పేర్కొంది. ఈ చర్యల ద్వారా సాగునీటి వినియోగం మెరుగుపడి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని అభిప్రాయపడింది. రాష్ట్రంలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) సరిహద్దులను తక్షణం గుర్తించి, ఆక్రమణలను తొలగించి వాటిని సంరక్షించాలని సూచించింది. చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని నివేదికలో వివరించింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువులు కీలక పాత్ర పోషిస్తున్నాయని కమిషన్ పేర్కొంది. చెరువుల ఆధారిత వ్యవసాయాన్ని బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా కొంతవరకు తగ్గించవచ్చని అభిప్రాయపడింది. నీటి వనరుల సంరక్షణను దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహంలో భాగంగా చూడాలని సూచించింది. గత రెండేళ్లలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సిఫారసులను ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి వివరించింది. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి కమిషన్ అందిస్తున్న సూచనలను సీఎం అభినందించారు. కమిషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, రైతుల ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని ఆచరణాత్మక సూచనలు అందించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం, కమిషన్ సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు సమావేశంలో వెల్లడైంది.

### గాంధీభవన్‌లో ఓబీసీ
## కులగణనపై సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్లపల్లి శంకర్, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, క్రమశిక్షణ కమిటీ కో–చైర్మన్ శ్యామ్‌కుమార్, మాజీ మేయర్ రామ్మోహన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌తో పాటు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఓబీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై సమగ్ర సమాచార సేకరణ అవసరాన్ని వారు ప్రస్తావించారు.
సమావేశంలో వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం, సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కులగణన గణాంకాల ప్రాధాన్యతను పలువురు నేతలు వివరించారు. ఓబీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, సమగ్ర అభివృద్ధి సాధనలో కులగణన కీలకమైన అడుగుగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

## ఓటర్ల జాబితా సవరణపై సీఎం కీలక లేఖ

- అర్హుల పేర్లు తొలగిపోకూడదన్న సూచన
- ఫిర్యాదుల గడువు పొడిగించాలని విజ్ఞప్తి
- పట్టణ ఓటర్ల ఇబ్బందులపై ఆందోళన
- ఎన్నికల సంఘానికి సహకారం అందిస్తామన్న ప్రభుత్వం



**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాసిన ముఖ్యమంత్రి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, న్యాయం, ప్రజా భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం, 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన లేదా ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల సంఘం గణాంకాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వీరిలో 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. డిజిటలైజ్ చేసిన గణన పత్రాల్లో కూడా భారీ స్థాయిలో లోపాలు ఉన్నాయని ఆయన వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గణన సిబ్బంది వచ్చిన సమయంలో ఇంట్లో లేని వారిని కూడా శాశ్వతంగా నివాసం మారిన వారిగా పరిగణించే పరిస్థితి ఉందని తెలిపారు. అలాగే నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు తగిన సహాయం అందించకుండా పాత ప్రాంతంలోని ఓటు తొలగించే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. అధికారిక నోటీసు ప్రక్రియను కూడా పూర్తిస్థాయిలో పాటించడం లేదని తెలిపారు. దీంతో అనేక మంది ఓటర్లు పోలింగ్ రోజునే తమ పేరు జాబితాలో లేదని తెలుసుకునే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన లేదా ఒకటికి మించి నమోదైన ఓటర్ల కేసులు అధికంగా ఉన్నాయని వివరించారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను మరింత సమగ్రంగా నిర్వహించేందుకు సమయం కేటాయించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం సెప్టెంబర్ 16తో ముగియనున్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని కోరారు. అలాగే గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాల ద్వారా ముసాయిదా జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులు తమ పత్రాలు సమర్పించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామసభలు, సహాయ కేంద్రాల ఏర్పాటు సహా అవసరమైన పరిపాలనా సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో స్పష్టం చేశారు.

### తమిళనాడు గవర్నర్‌గా
# నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎంకు కీలక బాధ్యత
- రాజకీయ అనుభవానికి గుర్తింపుగా నియామకం
- రాష్ట్రపతి ఉత్తర్వులతో నియామక ప్రకటన
- పలువురు నేతల అభినందనలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని తమిళనాడు గవర్నర్‌గా నియమించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కిరణ్‌కుమార్ రెడ్డికి దేశంలోని కీలక రాష్ట్రాల్లో ఒకటైన తమిళనాడుకు గవర్నర్ బాధ్యతలు అప్పగించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి ముఖ్యమంత్రిగా సేవలందించారు. శాసనసభ స్పీకర్‌గా, మంత్రిగా, ఎమ్మెల్యేగా వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయనకు పరిపాలనా వ్యవహారాలపై విస్తృత అనుభవం ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ముఖ్యమంత్రిగా కీలక పరిణామాలను ఎదుర్కొన్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గవర్నర్‌గా రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉండగా, కేంద్రం ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభ, రాజ్‌భవన్ మధ్య సమన్వయం సాధించడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి నియామకాన్ని పలువురు రాజకీయ నాయకులు స్వాగతించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయనకు గవర్నర్ పదవి దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయనకు ఉన్న అనుభవం తమిళనాడు రాష్ట్రానికి ఉపయోగపడుతుందని అభినందనలు తెలియజేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు. అనంతరం జాతీయ రాజకీయాల్లో కూడా చురుకైన పాత్ర పోషించారు. వివిధ దశల్లో ప్రజాప్రతినిధిగా, పరిపాలకుడిగా ఆయన సేవలు అందించారు. తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కిరణ్‌కుమార్ రెడ్డి త్వరలోనే రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన నియామకంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో ప్రముఖ నాయకుడు రాజ్యాంగబద్ధమైన కీలక పదవిని అధిష్ఠించనున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## టిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ పనులపై సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** నిర్మాణ పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో ప్రాజెక్టులను పూర్తి చేసే అంశాలపై చర్చించారు. టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్ ఆస్పత్రుల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టు రాష్ట్ర ఆరోగ్య రంగానికి కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అధునాతన వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య రంగంలో భారీ పెట్టుబడులు పెడుతోందని మంత్రి అన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ 1000 రోజుల
## పాలనపై బీఆర్ఎస్ సమరభేరి



**మేడ్చల్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న "కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై సమరభేరి" కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో శ్రీకారం చుట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా నాయకత్వం కార్యాచరణను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, మార్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ఎన్నికల హామీల అమలు పరిస్థితి, సంక్షేమ పథకాల అమలులో నెలకొన్న ఇబ్బందులపై నాయకులు విస్తృతంగా చర్చించారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రభుత్వంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సమావేశంలో తీర్మానించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల రక్షణ, ట్రాఫిక్ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని పోరాటం కొనసాగించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఏమి లభించింది, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారనే అంశాలను ప్రజల ముందుంచాలని సమావేశం నిర్ణయించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల తరఫున ప్రశ్నిస్తామని జిల్లా నాయకత్వం స్పష్టం చేసింది.

నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com

# సీఐ సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ విమర్శలు

- కొండా సురేఖ ఓఎస్డీ వ్యవహారంపై ప్రశ్నలు
- ఉన్నతాధికారుల పాత్రపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలు
- ఏసీపీ, డీసీపీలపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్న
- ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):**

మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్‌కు సంబంధించిన వ్యవహారంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సీఐ ముత్తు యాదవ్‌ను బలిపశువుగా చేశారని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ అంశంపై స్పందించిన ఆయన, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఓఎస్డీ సుమంత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రస్తుతం సీఐ ముత్తు యాదవ్‌ను మాత్రమే సస్పెండ్ చేయడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకే వ్యవహరించిన అధికారిపై మాత్రమే చర్యలు తీసుకోవడం సరైన విధానం కాదని విమర్శించారు. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై ప్రశ్నించగానే సీఐపై చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. అయితే ఈ నిర్ణయానికి దారితీసిన పరిపాలనా ప్రక్రియ ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక అధికారిపై చర్యలు తీసుకోవడం ద్వారా అసలు బాధ్యుల బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ కేసులో సంబంధిత ఏసీపీ వెంకట్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారుల పాత్రపై కూడా స్పష్టత ఇవ్వాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఒకవేళ విధుల్లో నిర్లక్ష్యం జరిగి ఉంటే కేవలం సీఐపైనే కాకుండా బాధ్యత వహించాల్సిన అన్ని స్థాయిల అధికారులపై సమానంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏసీపీ, డీసీపీలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పోలీస్ వ్యవస్థలో బాధ్యతాయుతమైన పరిపాలన ఉండాలంటే నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. అధికారులపై చర్యలు తీసుకునేటప్పుడు ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. లేకపోతే పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బందిలో అనిశ్చితి నెలకొనే ప్రమాదం ఉందన్నారు. కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్ వ్యవహారంలో జరిగిన పరిణామాలపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని, బాధ్యులపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపై ప్రజల్లో ఉన్న సందేహాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

# జగన్‌కు మరోసారి లోకేష్ సవాల్

- చర్చకు సిద్ధమా అంటూ ప్రశ్న
- వైసీపీపై విమర్శల వెల్లువ
- ఒంగోలులో టీడీపీ కార్యకర్తల సమావేశం
- కార్యకర్తలకు ఐక్యతా పిలుపు


**ఒంగోలు, ఆగస్టు 28 (నవజ్యోతి ప్రతినిధి):**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరోసారి బహిరంగ సవాల్ విసురుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి నారా లోకేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలోని పలు అంశాలపై చర్చించేందుకు జగన్ సిద్ధమైతే ఎక్కడికైనా రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటికే పలుమార్లు చర్చకు ఆహ్వానించినప్పటికీ స్పందన రాలేదని లోకేష్ పేర్కొన్నారు. పులివెందులలోనైనా, తాడేపల్లిలోనైనా చర్చకు వేదిక సిద్ధం చేయాలని సవాల్ విసిరారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై వాస్తవాలను బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రజల ముందే చర్చ జరగాలని కోరారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ వంటి అంశాలపై అవగాహన లేని వారు తనకు నీతులు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని లోకేష్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలు, నియామకాల వ్యవహారాలు, యువత సమస్యలపై వైసీపీ నేతలు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధి, సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని లోకేష్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తులో సానుకూల ఫలితాలను ఇస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని లోకేష్ పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజలతో అనుబంధాన్ని పెంచాలని లోకేష్ సూచించారు. టీడీపీ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగితే పార్టీ మరింత బలపడుతుందని ఆయన అన్నారు.

# బాబోయ్ మళ్ళీ చిరుత పులి

### లేగదూడపై దాడి చేసి చంపిన చిరుత....: బిట్ ఆఫీసర్ చిరంజీవి

**తూప్రాన్, 29 ఆగష్టు ( నవజ్యోతి ప్రతినిధి నవీన్ ) :**



కొన్ని నెలలుగా కనిపించని చిరుత గ్రామ శివారులో లేగ దూడను చంపి తినడంతో గ్రామస్తులలో మళ్ళీ మొదలైన ఆందోళన ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ చిరంజీవి తెలిపిన ప్రకారం...మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మన్నె వెంకటేష్ అనే రైతు ఎప్పటిలాగే తన వ్యవ సాయ పొలం వద్ద పశువులను గురువారం రాత్రి కట్టేసి శుక్రవారం ఉదయం పొలం వద్దకు వచ్చిన రైతు వెంకటేష్ లేగ దూడ పై దాడి చేసి చంపి తినడంతో లేగ దూడ చనిపోయిందని వెంటనే ఫారెస్ట్ అధికారులకు, గ్రామస్తులకు తెలియజేయడంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ బిట్ ఆఫీసర్ చిరంజీవి,సెక్షన్ అధికారి శ్రీనివాస్ గౌడ్ లు పద ముద్రల ద్వారా లేగదులపై దాడి చేసింది చిరుతపులేనని నిర్ధారించారు, ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ చిరంజీవి మాట్లాడుతూ అడవిలో చిరుత పులి సంచరిస్తున్నందున గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ కోనాయిపల్లి, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు ముఖ్యంగా పంట పొలాల వద్ద పశువులను ఉంచవద్దని, రాత్రి సమయాలలో రైతులు గ్రామస్తులు ఒంటరిగా అటవీ శివారు ప్రాంతాలకు పొలాల వద్దకు గాని ఒంటరిగా వెళ్లవద్దని, పొలాల వద్దకు వెళ్లే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు, పట్లూరి రాజిరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

# సీబీజీ ధరల సవరణపై కేంద్రం వివరణ

- వినియోగదారులపై భారీ భారం కాదని స్పష్టీకరణ
- ఉత్పత్తిదారులకు స్థిరమైన ధరల మద్దతు
- గోబర్ధన్ పథకం కింద కొత్త ధర విధానం
- ప్రభుత్వ సబ్సిడీతో వినియోగదారులకు రక్షణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):**

गోబర్ధన్ పథకం కింద కంప్రెస్డ్ బయోగ్యాస్ ధరలను సవరించిన నేపథ్యంలో సిఎన్‌జీ, పీఎన్‌జీ వినియోగదారులపై భారీ భారం పడుతుందన్న వార్తా కథనాలపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. సవరించిన ధరల విధానం ఉత్పత్తిదారులకు మద్దతు అందించడంతో పాటు వినియోగదారుల ప్రయోజనాలను కూడా కాపాడేలా రూపొందించామని తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం సీబీజీ ఉత్పత్తిదారులకు చెల్లించే ధర, సిఎన్‌జీ రిటైల్ ధరలో 85 శాతం ఆధారంగా నిర్ణయించబడుతోంది. తాజా లెక్కల ప్రకారం ఇది ఎంఎంబీటీయూకు సుమారు ₹1,478గా ఉంది. గోబర్ధన్ పథకం కింద ఈ ధరను ఎంఎంబీటీయూకు ₹2,110గా నిర్ణయించడంతో సీబీజీ ఉత్పత్తిదారులకు సుమారు 43 శాతం ధరల పెరుగుదల లభిస్తోంది. అయితే ఈ మొత్తం ధరను నేరుగా సిఎన్‌జీ లేదా గృహ పీఎన్‌జీ వినియోగదారుల నుంచి వసూలు చేయబోమని కేంద్రం స్పష్టం చేసింది. సీబీజీ ఉత్పత్తిదారులకు అందించే ధరలో భాగంగా ప్రభుత్వం కిలోకు ₹10 చొప్పున ఆర్థిక మద్దతు అందించనుంది. ఇది 95 శాతం మీథేన్ కలిగిన సీబీజీకి ఎంఎంబీటీయూకు సుమారు ₹215కు సమానమని వివరించింది. ప్రభుత్వ మద్దతు మొత్తాన్ని మినహాయించిన తర్వాత వినియోగదారులపై పరోక్షంగా పడే సీబీజీ వ్యయం ఎంఎంబీటీయూకు సుమారు ₹1,895గా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న ₹1,478తో పోలిస్తే ఇది దాదాపు 28 శాతం పెరుగుదల మాత్రమేనని, మీడియాలో ప్రచారమవుతున్నట్లుగా పూర్తి ధర పెరుగుదల వినియోగదారులపై మోపబడదని తెలిపింది. సీబీజీ ఉత్పత్తి రంగం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి స్థిరమైన ధరలు అవసరమని కేంద్రం అభిప్రాయపడింది. రైతులు, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు, బయోగ్యాస్ ప్లాంట్లకు ప్రోత్సాహం అందించేందుకు ఈ ధరల సవరణ కీలకమని పేర్కొంది. దీంతో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని తెలిపింది. సవరించిన ధరల విధానం ద్వారా ఒకవైపు సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన ఆదాయం లభిస్తుండగా, మరోవైపు ప్రభుత్వ ఆర్థిక మద్దతు, విస్తృత గ్యాస్ పంపిణీ వ్యవస్థ ద్వారా వినియోగదారులపై గణనీయమైన ధరల భారం పడకుండా చర్యలు తీసుకున్నామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విధానం దేశంలో స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని మరింత ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంది.

सत्यमेव जयते
पेट्रोलियम एवं प्राकृतिक गैस मंत्रालय
MINISTRY OF PETROLEUM AND NATURAL GAS

## తెలంగాణపై మాదకద్రవ్యాల నీడ..

# దారులు ఎన్నో, ప్రమాదం ఒక్కటే!




- నగరం నుంచి పల్లె దాకా గంజాయి జాడలు.. రైళ్లు, కొరియర్ పార్సిళ్లు, అంతర్జాలం, చిన్న అడ్డాల ద్వారా విస్తరిస్తున్న మత్తు వ్యాపారం

**ఆగస్టు 30 (నవజ్యోతి ఎడిటోరియల్)**

తెలంగాణలో మాదకద్రవ్యాల సమస్య క్రమంగా విస్తరిస్తోంది. పోలీసుల నేర సమీక్ష ప్రకారం 2023–24లో 2,026గా ఉన్న మాదకద్రవ్య కేసులు 2025–26లో 2,960కి చేరాయి. రెండేళ్లలో 46.10 శాతం పెరుగుదల నమోదైంది. ఇదే సమయంలో రాష్ట్రంలో మొత్తం నేరాలు 7.15 శాతం పెరగగా.. తీవ్రమైన నేరాలు 10.33 శాతం తగ్గాయి. దీంతో మాదకద్రవ్య కేసుల పెరుగుదల ప్రత్యేక ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం పోలీసుల సమస్య కాదు.. యువత భవిష్యత్తు, కుటుంబాలు, ప్రజారోగ్యానికి సంబంధించిన సవాలు.

### చిన్న అడ్డాల ద్వారా.. పల్లెల్లోకి గంజాయి

మత్తు ప్రభావం నగరాలకే పరిమితం కావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోనూ గంజాయి విక్రయం, వినియోగంపై ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చాయ్ దుకాణాలు, చిన్న అడ్డాలు, రద్దీ తక్కువగా ఉండే ప్రదేశాలను అక్రమ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అయితే ఆధారాలు లేకుండా ఏ దుకాణాన్నీ అనుమానించడం సరికాదు. ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాల్లో వాస్తవాలను నిర్ధారించి చర్యలు తీసుకోవడంతోపాటు స్థానిక నిఘాను బలోపేతం చేయాలి.

### రైళ్ల నుంచి కొరియర్ పార్సిళ్ల వరకు

గంజాయి రవాణాకు రైలు మార్గాలనూ ఉపయోగిస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. జూలైలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 41.131 కిలోల గంజాయి పట్టుబడగా.. ఆగస్టులో వరంగల్–ఖమ్మం మార్గంలో 129 కిలోలు, హనుమకొండలో మరో కేసులో 251 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తెలంగాణకు గంజాయి చేరుతున్న తీరుకు ఇవి ఉదాహరణలు. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన ఓ కేసులో 21 రాష్ట్రాలకు తపాలా, కొరియర్ మార్గాల్లో గంజాయి పంపినట్లు దర్యాప్తులో తేలింది. రోజుకు 80 నుంచి 100 వరకు ఆర్డర్లు తీసుకుని, నెలకు రూ.30–35 లక్షల వరకు లావాదేవీలు సాగినట్లు పోలీసులు తెలిపారు. అంతర్జాల సందేశాల ద్వారా ఆర్డర్లు తీసుకోవడం, నగదు రహిత చెల్లింపులు, పార్సిళ్ల ద్వారా సరఫరా చేయడం వంటి పద్ధతులు బయటపడ్డాయి.

### అంతర్జాలం.. ఇంటి గుమ్మం వరకు

మత్తు వ్యాపారులు సాంకేతిక మార్గాలనూ వినియోగించుకుంటున్నట్లు కొన్ని కేసులు వెల్లడిస్తున్నాయి. సందేశాల ద్వారా ఆర్డర్లు తీసుకోవడం, నగదు రహిత చెల్లింపులు స్వీకరించడం, పటాల ద్వారా సరుకు దాచిన ప్రదేశాలను తెలియజేయడం వంటి పద్ధతులు బయటపడ్డాయి. ఓ కేసులో 100 మంది వినియోగదారులను గుర్తించగా.. వారిలో 80 మంది పరీక్షల్లో సానుకూలంగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. కొరియర్, పార్సిల్ వ్యవస్థలను కూడా అక్రమ రవాణాకు ఉపయోగించిన ఘటనలు ఉన్నాయి. దీంతో అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులను గుర్తించడంతోపాటు పార్సిళ్ల భద్రతా తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది.

### సరుకుతోపాటు డబ్బుపైనా నిఘా

మాదకద్రవ్యాల దందాను అడ్డుకోవాలంటే సరుకు పట్టుకోవడంతో దర్యాప్తు ఆగకూడదు. దాని వెనుక ఉన్న డబ్బు ప్రవాహాన్ని గుర్తించడం కీలకం. మత్తుపదార్థాల ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది.. ఏ ఖాతాల ద్వారా తిరుగుతోంది.. ఎలాంటి ఆస్తుల్లోకి మళ్లుతోంది అన్నదానిపైనా దర్యాప్తు జరగాలి. వినోద కేంద్రాలు, వేడుకల ప్రదేశాలు లేదా ఇతర వ్యాపారాల పేరుతో అక్రమ డబ్బు చలామణి అవుతోందన్న సమాచారం వస్తే ఆధారాల మేరకు విచారణ జరపాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా ఏ సంస్థనూ, వ్యాపారాన్నీ అనుమానించడం సరికాదు.

### చిత్ర పరిశ్రమకూ మినహాయింపు వద్దు

మాదకద్రవ్యాల దర్యాప్తుల్లో చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తుల పేర్లు వినిపించిన సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఈ రంగానికి సంబంధించిన వ్యక్తులు, ప్రదేశాలపై తనిఖీలు జరిగిన ఘటనలూ వెలుగులోకి వచ్చాయి. ఒకరిపై కేసు నమోదైనంత మాత్రాన మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం ఎంత తప్పో.. ప్రముఖుల పేర్లు ఉన్నాయని దర్యాప్తు నుంచి మినహాయింపు ఇవ్వడం కూడా అంతే తప్పు. పేరు ఎంత పెద్దదైనా.. చట్టం ముందు బాధ్యత ఒక్కటే.

### వినియోగదారుడి కంటే సరఫరా గొలుసుపైనే దృష్టి

ఒక వినియోగదారుడిని పట్టుకోవడం తక్షణ చర్య మాత్రమే. అసలు సమస్యను అడ్డుకోవాలంటే మత్తుపదార్థం ఎక్కడి నుంచి వస్తోంది.. ఎవరు రవాణా చేస్తున్నారు.. ఎక్కడ నిల్వ చేస్తున్నారు.. ఎవరికి చేరుతోంది.. డబ్బు ఎలా తిరుగుతోంది అన్న మొత్తం వ్యవస్థను ఛేదించాలి. అదే సమయంలో వ్యసనానికి గురైన వారిని కేవలం నేరస్థులుగా చూడటం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. అవసరమైన వారికి వ్యసన విముక్తి చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం అందాలి. పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలి.

### మారుతున్న దారులకు తగ్గట్టే నిఘా

మాదకద్రవ్యాల సరఫరా మార్గాలు మారుతున్నప్పుడు నిఘా వ్యవస్థ కూడా మారాలి. గ్రామాల్లో స్థానిక సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలి. రైల్వే మార్గాల్లో సమన్వయ తనిఖీలు పెంచాలి. కొరియర్ పార్సిళ్లలో అక్రమ రవాణాను గుర్తించే చర్యలు చేపట్టాలి. అంతర్జాల లావాదేవీలపై చట్టపరమైన నిఘాను మరింత సమర్థంగా నిర్వహించాలి. మాదకద్రవ్య కేసులు 46.10 శాతం పెరగడం కేవలం గణాంకం కాదు.. తెలంగాణకు వచ్చిన హెచ్చరిక. గంజాయి ఏ దారిలో వచ్చినా.. దాని వెనుక ఉన్న సరఫరా వ్యవస్థను గుర్తించి అడ్డుకోవడమే కీలకం. లక్ష్యం కేసుల సంఖ్య పెంచడం మాత్రమే కాదు.. మత్తుపదార్థాల అందుబాటును తగ్గించడం, సరఫరా వ్యవస్థను కూల్చడం, యువతను కాపాడడం, వ్యసనానికి గురైనవారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం.

# నీటి పొదుపు అందరి బాధ్యత

### సర్పంచ్ జంగిలి పోచాలు

**పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):**



భావితరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు అన్నారు. శనివారం గుండారం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులకు 'జలసిరి' పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి పథకంపై రూపొందించిన పోస్టర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టాలను పెంచుకోవచ్చని తెలిపారు. రైతులు పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబీర్ రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు సదయ్య, పంచాయతీ కార్యదర్శి బచ్చల ప్రసాద్, ఏఈఓ నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్ ఏలువాక సతీష్, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్రైమ్ పారామీటర్లలో రామగుండం

# పోలీసుల ఉత్తమ ప్రతిభ

### డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు

**పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):**



రాష్ట్రస్థాయిలో క్రైమ్ పారామీటర్ల అమలులో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల పనితీరును సమీక్షించిన అధికారులు అత్యుత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లను గుర్తించారు. క్లస్టర్–1లో హైదరాబాద్, క్లస్టర్–2లో రామగుండం, క్లస్టర్–3లో నల్గొండ, క్లస్టర్–4లో సూర్యాపేట పోలీస్ యూనిట్లు మొదటి స్థానాల్లో నిలిచాయి. రామగుండం కమిషనరేట్ ఉత్తమ పనితీరుకు గుర్తింపుగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్‌లకు శనివారం డీజీపీ సీవీ ఆనంద్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# గౌతోజిగూడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందాలి: సర్పంచ్ నాగరాజ్

**మనోహరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి నవీన్):**



మనోహరాబాద్ మండలం గౌతోజిగూడ గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పరుశబోయిన నాగరాజ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శితో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజ్ మాట్లాడుతూ నిజమైన పేదలు, అర్హులైన లబ్ధిదారులకే రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డు విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర నాగరాజ్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 34 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి

* సీఎం రేవంత్‌రెడ్డికి బీసీ నేత ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి. రాజగోపాల్):



రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకుల, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సుమారు 34 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరతతో సుమారు 14 వేల పాఠశాలల్లో ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ బోధనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో 5,900, గురుకుల పాఠశాలల్లో సుమారు 9,000, ఆదర్శ పాఠశాలల్లో 3,000, కస్తూర్బా పాఠశాలల్లో 1,500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గెస్ట్, పార్ట్‌టైమ్ టీచర్లతో విద్యాబోధన కొనసాగించడం వల్ల విద్యార్థులపై ప్రభావం పడుతోందని అన్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఖాళీ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టాలని ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ లోపాలను సరిదిద్ది ఓటు హక్కును కాపాడాలి

* ఆర్డీవో కార్యాలయంలో అధికారికి బీజేపీ నేతల వినతి



కీసర, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):

దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో లోపాలను సరిదిద్ది అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ బీజేపీ నాయకులు శనివారం కీసర ఆర్డీవో కార్యాలయంలో అధికారి సైదిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దమ్మాయిగూడలోని 39 పోలింగ్ కేంద్రాల పరిధిలో గతంలో సుమారు 48 వేల మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 33 వేలకు తగ్గారని, సుమారు 24 వేల మందికి నోటీసులు జారీ చేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. నోటీసులు అందుకున్న వారికి ఆధారాలు సమర్పించేందుకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. గతంలో ఓటు హక్కు కలిగి, చెల్లుబాటు అయ్యే ఆధారాలున్న వారి వివరాలను ప్రత్యేకంగా పరిశీలించాలని, అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులను సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రానికి అనుసంధానం చేయాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువత, చిరునామా మారిన అర్హులైన పౌరులకు ఓటర్ల జాబితాలో అవకాశం కల్పించాలని, బీఎల్ఓలు, బీఎల్ఏ–2లకు స్పష్టమైన మార్గదర్శకాలు, సాంకేతిక సహాయం అందించాలని సూచించారు. "అర్హుడైన ఒక్క ఓటరు కూడా మిగలకూడదు.. అనర్హుడైన ఒక్క ఓటు కూడా ఉండకూడదు" అనే లక్ష్యంతో ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ నాయకుడు, అసెంబ్లీ కంటెస్టెడ్ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, గాలి సంపత్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కోలా బాలరాజ్‌యాదవ్, బిలకంటి ధర్మేందర్, తడాఖ కృష్ణ, తాటి ఆనంద్, చక్రపాణి, కర్ణాకర్, బాలయ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నందగోకుల్–చెల్మెడ రోడ్డు కోసం బీఆర్ఎస్ పాదయాత్ర

* వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి: పద్మా దేవేందర్‌రెడ్డి

రామయంపేట్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):



నందగోకుల్–నస్కల్–చెల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పాదయాత్ర నిర్వహించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రకు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నందగోకుల్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్ర ప్రారంభమై చెల్మెడ కమాన్ వరకు కొనసాగింది. రహదారి గుంతలు, బురదతో అధ్వానంగా మారడంతో రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. రోడ్డు పరిస్థితి కారణంగా ఆర్టీసీ బస్సుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయని అన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఆమె ఆరోపించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి, రోడ్డు పనులను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ రహదారి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లావణ్యరెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, జీవన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు బాజా చంద్రం, బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీలు, మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, బీఆర్ఎస్వీ నాయకుడు బజార్ రంజిత్‌గౌడ్, కౌన్సిలర్ సుచరిత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేరాల కట్టడికి ఏఐ సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలి: డీజీపీ సీవీ ఆనంద్

- సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్ డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి



హైదరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి డెస్క్ ):

నేరగాళ్లు కొత్త సాంకేతికతను వినియోగిస్తున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు కూడా కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా ఆధారిత సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖలో అందుబాటులో ఉన్న ఏఐ ఆధారిత అప్లికేషన్లను మరింతగా వినియోగించాలని, క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్), ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ (ఐసీజేఎస్)లో డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ–ఎవిడెన్స్, ఈ–ఫోరెన్సిక్స్, కొత్త నేర చట్టాలఅమలు, జాతీయ స్థాయి పోలీసింగ్ పోర్టల్స్‌పై రాష్ట్ర పనితీరును సమీక్షించారు.లోపాలనుగుర్తించిపనితీరునుమెరుగుపచాలని సూచించారు.

### కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి

కోర్టు కేసుల నిర్వహణ, న్యాయ ప్రక్రియపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ న్యాయపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. దర్యాప్తు, కోర్టు విధానాలు, న్యాయపరమైన అంశాలపై సిబ్బందికి నిరంతరం శిక్షణ ఇవ్వాలని సూచించారు.

### మారుతున్న నేరాలకు అనుగుణంగా శిక్షణ

మారుతున్న నేర పద్ధతులకు అనుగుణంగా పోలీసు శిక్షణ కార్యక్రమాలను కూడా మార్చాలని సీవీ ఆనంద్ అన్నారు. జిల్లా, నగర శిక్షణ కేంద్రాలు, పోలీసు కళాశాలలు, బెటాలియన్లు, పోలీసు అకాడమీలు ఆధునిక సాంకేతికత, కొత్త నేర ధోరణులపై శిక్షణ అందించాలని సూచించారు. ఏఐ ఆధారిత అప్లికేషన్ల రూపకల్పనలో చొరవ చూపుతున్న యువ ఐపీఎస్ అధికారులను డీజీపీ అభినందించారు. పోలీసు వ్యవస్థలో సాంకేతికతను మరింత సమర్థవంతంగా వినియోగించే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాలని ప్రోత్సహించారు. 2013 బ్యాచ్‌తో పాటు తదుపరి బ్యాచ్‌ల ఐపీఎస్ అధికారులకు నాయకత్వంపై ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు.

### క్రైమ్ పారామీటర్లలో రామగుండం ఉత్తమం

రాష్ట్రంలోని వివిధ పోలీసు యూనిట్ల క్రైమ్ కంట్రోల్ పనితీరును సమీక్షించిన అనంతరం నాలుగు క్లస్టర్లలో ఉత్తమంగా నిలిచిన యూనిట్లను ప్రకటించారు. క్లస్టర్–1లో హైదరాబాద్, క్లస్టర్–2లో రామగుండం, క్లస్టర్–3లో నల్గొండ, క్లస్టర్–4లో సూర్యాపేట మొదటి స్థానాల్లో నిలిచాయి. ఆయా యూనిట్ల అధికారులకు డీజీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో డీజీ లా అండ్ ఆర్డర్ మహేశ్ భగవత్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇంగువ అమ్మకాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కొరడా

- ఎవరెస్ట్, లాల్‌జీ గోధూ కంపెనీల కాంపౌండెడ్ ఇంగువపై తక్షణ నిషేధం.. నాణ్యత ప్రమాణాలు పాటించలేదని గుర్తింపు

ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):




కాంపౌండెడ్ ఇంగువ (హింగ్) నాణ్యతపై కేంద్ర ఆహార భద్రతా సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్‌జీ గోధూ అండ్ కంపెనీ (ఎల్‌జీ బ్రాండ్ యూనిట్) తయారు చేస్తున్న కాంపౌండెడ్ ఇంగువ అమ్మకాలను తక్షణమే నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. వినియోగదారుడి ఫిర్యాదు అనంతరం మార్కెట్‌లో చేపట్టిన తనిఖీల్లో రెండు సంస్థల ఇంగువ నమూనాలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవని పరీక్షల్లో తేలింది.

### ఎవరెస్ట్ ఇంగువలో తగ్గిన ఎక్స్‌ట్రాక్ట్

కాంపౌండెడ్ ఇంగువలో కనీసం 5 శాతం ఆల్కహాల్ సాల్యుబుల్ ఎక్స్‌ట్రాక్ట్ ఉండాలి. అయితే పరీక్షించిన ఎవరెస్ట్ నమూనాల్లో ఇది 0 నుంచి 3 శాతం మాత్రమే ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. కొన్ని నమూనాల్లో 3.29 శాతం, 4.4 శాతం మాత్రమే నమోదైంది. దీంతో ఉత్పత్తులు 'మిస్‌బ్రాండెడ్, సబ్‌స్టాండర్డ్'గా గుర్తించారు.

### లాల్‌జీ గోధూ ఇంగువలో అధిక స్టార్చ్

లాల్‌జీ గోధూ యూనిట్‌లో తయారీకి ఉపయోగిస్తున్న ముడి ఇంగువలోనూ లోపాలను గుర్తించారు. ఆరు రకాల ముడి ఇంగువ నమూనాల్లో 15 నుంచి 32 శాతం వరకు స్టార్చ్ ఉన్నట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలింది. నిబంధనల ప్రకారం ముడి ఇంగువలో స్టార్చ్ గరిష్ఠంగా 1 శాతం మాత్రమే ఉండాలి.

### అన్ని ఎవరెస్ట్ మసాలాలు బ్యాన్ కాదు

ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్య కాంపౌండెడ్ ఇంగువ ఉత్పత్తులకే పరిమితం. ఎవరెస్ట్ సంస్థకు చెందిన అన్ని మసాలా ఉత్పత్తులను నిషేధించినట్లు కాదు. గత తనిఖీల్లో చికెన్ మసాలా, గరం మసాలా, ఎగ్ కర్రీ పౌడర్ తదితర ఉత్పత్తుల్లో లేబులింగ్‌కు సంబంధించిన ఉల్లంఘనలు కూడా గుర్తించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

### రీకాల్‌కు సూచన"

ప్రమాణాలు పాటించని ఉత్పత్తులను మార్కెట్ నుంచి స్వచ్ఛందంగా వెనక్కి తీసుకోవాలని రెండు సంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. లోపాలను సరిచేసేందుకు సమగ్ర యాక్షన్ ప్లాన్ సమర్పించాలని ఆదేశించింది. నిబంధనలు పాటించకపోతే చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## బీఆర్ఎస్ హయాంలోనే రామాయంపేట సర్వనాశనం

పాదయాత్రల పేరుతో ప్రజలను మోసం చేయొద్దు

రామాయంపేట, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):



బీఆర్ఎస్ హయాంలోనే రామాయంపేట ఉమ్మడి మండలం అభివృద్ధికి దూరమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు ఆరోపించారు. శుక్రవారం రామాయంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మాదేవేందర్‌రెడ్డి జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగిన సమయంలో రామాయంపేట అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు రామాయంపేటకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారులు, మురుగు కాలువల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు.

### రూ.13 కోట్ల నిధులపై సమాధానం చెప్పాలి

చల్మడ, రాంపూర్ రహదారుల అభివృద్ధికి సుమారు రూ.13 కోట్ల నిధులు పద్మాదేవేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే మంజూరయ్యాయని రాగి రాములు తెలిపారు. నిధులు మంజూరైన తర్వాత కూడా పనులు ఎందుకు పూర్తికాలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రజా సమస్యల పేరుతో పాదయాత్రలు నిర్వహించడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. గతంలో పరిష్కరించలేని సమస్యలపై ఇప్పుడు పాదయాత్రలు చేపట్టే ముందు ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. నిజంగా ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే మెదక్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సవాల్ చేశారు. రామాయంపేట ఉమ్మడి మండలంలోని అధ్వానంగా ఉన్న రహదారులకు ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేపట్టాలని రాగి రాములు కోరారు. చల్మడ, రాంపూర్ రహదారులతో పాటు పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో బీజేపీ నేతల భేటీ



కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):

త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని పూర్వ రంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ రంగారెడ్డి జిల్లా పరిధిలో బీజేపీ కార్యకలాపాలు, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. గవర్నర్ ఇంద్రసేనారెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ నాయకులు ఆత్మీయంగా ముచ్చటించారు. డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, కాంతారావు, అంజన్‌కుమార్ గౌడ్, బోసుపల్లి ప్రతాప్, నందనం దివాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర చారి, వెంకటేష్ నాయక్, పాపయ్య గౌడ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తాం: ఎమ్మెల్యే శ్రీగణేష్



సికింద్రాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి బ్యూరో చీఫ్ టి. రాజగోపాల్):

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం బోయిన్‌పల్లిలోని యాదవ భవన్‌లో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ రేషన్ కార్డు కేవలం నిత్యావసర సరుకుల కోసం మాత్రమే కాకుండా పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హతను నిర్ధారించే ముఖ్యమైన పత్రంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రూ.12 కోట్ల సీఎంఆర్ ధాన్యంపై సమగ్ర విచారణ జరపాలి

- బ్యాంకు లావాదేవీలు, ఆస్తులపైనా దర్యాప్తు చేయాలి: డా. మార్షల్ దుర్గం నగేష్

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, రామగుండం:



పవనసుత రైస్‌మిల్‌కు సంబంధించినదిగా పేర్కొంటున్న సుమారు రూ.12 కోట్ల సీఎంఆర్ ధాన్యం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో శ్రీలక్ష్మి రైస్‌మిల్ యజమాని ఒల్లాల సత్యనారాయణ పాత్రపై విజిలెన్స్, ఈడీ అధికారులు లోతుగా దర్యాప్తు చేయాలని కోరారు. సత్యనారాయణతో పాటు సంబంధిత వ్యక్తుల బ్యాంకు ఖాతాల లావాదేవీలను పరిశీలించాలని, శ్రీలక్ష్మి రైస్‌మిల్, పీబీఆర్ఎం సూరయ్యపల్లి తదితర సంస్థలకు సంబంధించి 2018 నుంచి 2026 వరకు జరిగిన ధాన్యం సరఫరా, చెల్లింపులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించాలని అన్నారు. కుటుంబ సభ్యుల పేరిట ఉన్న ఆస్తులు, రియల్ ఎస్టేట్, పెట్రోల్ బంక్ తదితర వ్యాపారాలకు సంబంధించిన లావాదేవీలపైనా దర్యాప్తు జరపాలని కోరారు. ఆస్తుల కొనుగోళ్లకు నిధులు ఎక్కడి నుంచి సమకూరాయన్న అంశాన్ని కూడా తేల్చాలని అన్నారు. సీఎంఆర్ ధాన్యం వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డా. మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరారు.

## పాలటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మనోహరాబాద్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి నవీన్):



మనోహరాబాద్ మండలం పాలట గ్రామంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నీలం సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్‌తో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయికుమార్ మాట్లాడుతూ నిజమైన పేదలు, అర్హులైన లబ్ధిదారులకే రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డు విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సమన్వయంతో పనిచేయాలనికోరారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్యాకెట్‌పై ఎర్రగుర్తు కోసం.. సుప్రీంకోర్టు దాకా ఎందుకు?

**✻ ప్రజల ఆరోగ్యం కంటే కంపెనీల ప్రయోజనాలే ముఖ్యమా?.. ప్రపంచం హెచ్చరిస్తుంటే భారత్ ఇంకా ఎందుకు వెనుకే?**




**ఆగస్టు 30 (నవజ్యోతి ఎడిటోరియల్ నోట్)**

ప్యాకెట్ ఆకర్షణీయంగా ఉంటుంది.. ప్రకటన మాయ చేస్తుంది.. రుచి నోరూరిస్తుంది. కానీ ఆ ప్యాకెట్‌లో ఎంత ఉప్పు ఉంది? ఎంత చక్కెర ఉంది? ఎంత కొవ్వు ఉంది? ఆరోగ్యానికి హాని చేసే పదార్థాలెన్ని ఉన్నాయి? ఇవి తెలుసుకోవడానికి మాత్రం వినియోగదారుడు ప్యాకెట్ వెనుక చిన్న అక్షరాలను వెతుక్కోవాల్సిందే.ఇన్‌స్టంట్ నూడుల్స్, చిప్స్, బిస్కెట్లు, కేకులు, చాక్లెట్లు, తీపి పానీయాలు, సాస్‌లు, రెడీ–టు–ఈట్ ఫుడ్స్, ఫ్రోజెన్ ఫుడ్స్.. ఇలా ప్యాకెట్ ఆహారం మన జీవితంలో భాగమైపోయింది. ముఖ్యంగా పిల్లల చేతుల్లోకి ఇవి సులభంగా చేరుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రజలకు ఆహారంపై స్పష్టమైన సమాచారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత కాదా?అధిక ఉప్పు, చక్కెర, సాచురేటెడ్ ఫ్యాట్ ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్స్‌ను వినియోగదారుడు ప్యాకెట్ ముందుభాగంలోనే గుర్తించేలా హెచ్చరికలు ఇవ్వాలన్న అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.కానీ ఈ నిర్ణయం తీసుకోవడానికి కూడా దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

### సుప్రీంకోర్టు ఎందుకు అంత తీవ్రంగా ప్రశ్నించింది?

ఫ్రంట్–ఆఫ్–ప్యాక్ లేబులింగ్ విషయంలో కేంద్రం, FSSAI వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆగస్టు 13న జరిగిన విచారణలో గత ఆదేశాల తర్వాత కూడా ఈ విషయంలో ఎందుకు పురోగతి లేదని ప్రశ్నించింది. పరిశ్రమల అభ్యంతరాల కారణంగా ప్రజారోగ్య చర్యలు ఆలస్యం అవుతున్నాయా అన్న అంశాన్ని కూడా కోర్టు తీవ్రంగా ప్రస్తావించింది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది.ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన నిర్ణయానికి కంపెనీల అభ్యంతరాలు ఎందుకు అడ్డంకి కావాలి?కంపెనీ తన ఉత్పత్తి అమ్మకాలు తగ్గకూడదని కోరుకోవచ్చు. ప్యాకెట్‌పై ఎరుపు రంగు హెచ్చరిక ఉంటే వినియోగదారుడు వెనక్కి తగ్గవచ్చని ఆందోళన చెందవచ్చు. అది వారి వ్యాపార ప్రయోజనం.కానీ ప్రభుత్వం కూడా అదే భయంతో వెనక్కి తగ్గితే?అప్పుడు ప్రజల తరఫున నిలబడేది ఎవరు? ప్రపంచం ముందుకెళ్లింది.. భారత్ ఇంకా ఎందుకు చర్చల్లోనే?ఇది భారత్‌కు కొత్త ఆలోచన కాదు. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే ప్యాకెట్ ముందు భాగంలోనే ఆరోగ్య హెచ్చరికలను అమలు చేస్తున్నాయి.చిలీ, మెక్సికో, పెరూ, బ్రెజిల్, అర్జెంటీనా, కొలంబియా, ఉరుగ్వే, ఈక్వెడార్ తదితర దేశాల్లో అధిక చక్కెర, సోడియం, సాచురేటెడ్ ఫ్యాట్ ఉన్న ఉత్పత్తులపై స్పష్టమైన హెచ్చరికలు కనిపిస్తాయి.చిలీలో ప్యాకెట్‌పై 'HIGH IN' అంటూ స్పష్టమైన హెచ్చరిక గుర్తులు ఉంటాయి. పిల్లలను ఆకర్షించే ఆహార ప్రకటనలపైనా అక్కడ పరిమితులు విధించారు.యూకేలో ఉప్పు, చక్కెర, కొవ్వు స్థాయిని ఎరుపు, అంబర్, ఆకుపచ్చ రంగులతో సులభంగా అర్థమయ్యేలా చూపించే ట్రాఫిక్ లైట్ లేబులింగ్ ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో హెల్త్ స్టార్ రేటింగ్ విధానం అమలులో ఉంది.అంటే ప్రపంచంలోని అనేక దేశాలు ఒక విషయం గుర్తించాయి.వినియోగదారుడికి సమాచారం దాచడం కాదు.. కళ్లముందే పెట్టాలి.

### ఇంకెంత అధ్యయనం కావాలి?

భారత్‌లో ఫ్రంట్–ఆఫ్–ప్యాక్ లేబులింగ్‌పై చర్చ కొత్తది కాదు. FSSAI ఇప్పటికే వివిధ విధానాలను ప్రతిపాదించింది. హెల్త్ స్టార్ రేటింగ్ నుంచి హెచ్చరిక లేబులింగ్ వరకు ఎన్నో ప్రతిపాదనలు వచ్చాయి. ఆరోగ్య నిపుణులు మాత్రం ఉత్పత్తి ఆరోగ్యకరమా కాదా అన్న సందేహం లేకుండా.. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు ఉంటే అదే విషయాన్ని నేరుగా చెప్పే హెచ్చరిక ఉండాలని సూచిస్తున్నారు.ఇతర దేశాల్లో అమలైన విధానాలపై పరిశోధనలు ఉన్నాయి. WHO మార్గదర్శకాలు ఉన్నాయి. మన దేశంలో ఆరోగ్య నిపుణుల సూచనలు ఉన్నాయి.అయినా నిర్ణయం తీసుకోవడంలో ఇంత ఆలస్యం ఎందుకు?ప్రజల ఆరోగ్యంపై నిర్ణయం తీసుకోవడానికి ఇంకెన్ని సంవత్సరాల అధ్యయనం అవసరం?

### లేబుల్ మీద కూడా కంపెనీల భయమేనా?

ఒక ఉత్పత్తి ప్యాకెట్‌పై 'అధిక చక్కెర', 'అధిక ఉప్పు', 'అధిక కొవ్వు' అని స్పష్టంగా రాస్తే అమ్మకాలు ప్రభావితం కావచ్చు. కానీ అది వినియోగదారుడికి నిజం తెలియజేసినందుకు జరిగే ప్రభావం.ప్రభుత్వం ఆ నిజాన్ని దాచాల్సిన అవసరం ఏముంది?కంపెనీలకు లాభాలు కావాలి. అది వ్యాపారంలో సహజం. కానీ ప్రభుత్వం కంపెనీల లాభాల కోసం పనిచేసే సంస్థ కాదు. ప్రజల ప్రయోజనాలు, ప్రజల ఆరోగ్యం కాపాడటమే ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత.అందుకే సుప్రీంకోర్టు ప్రశ్నలు కీలకంగా మారాయి.

### కార్పొరేట్ ఒత్తిడికి ప్రభుత్వాలు ఎందుకు భయపడాలి?

ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన నిబంధనల విషయంలో పరిశ్రమల అభ్యంతరాలను వినడం తప్పు కాదు. కానీ ఆ అభ్యంతరాల కారణంగా నిర్ణయాలు ఏళ్ల తరబడి వాయిదా పడటం మాత్రం ప్రశ్నించాల్సిన విషయమే.సుప్రీంకోర్టు చెప్పే వరకు కూడా ప్రభుత్వాలకు ప్రజల ఆరోగ్యం గుర్తుకు రాకపోవడం దురదృష్టకరం కాదా?

### తెలంగాణలో ప్యాకెట్ బయట కనిపిస్తున్న అసలు కథ

ఇది కేవలం ప్యాకెట్ ముందు భాగంలో ఏ గుర్తు ఉండాలన్న ప్రశ్న కాదు. తెలంగాణలో జరుగుతున్న ఫుడ్ సేఫ్టీ తనిఖీలు చూస్తే ఆహార భద్రత సమస్య ఎంత విస్తృతంగా ఉందో తెలుస్తోంది.హైదరాబాద్‌లో వరుస తనిఖీల్లో కల్తీ నెయ్యి, నాసిరకం ముడి పదార్థాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, అపరిశుభ్ర తయారీ కేంద్రాలు, తప్పుదారి పట్టించే లేబుల్స్, నిబంధనలకు విరుద్ధమైన ప్రకటనలు బయటపడుతున్నాయి.H–FAST తనిఖీల్లో భారీగా కల్తీ, అసురక్షిత ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకోవడం, కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను చెబుతోంది.అంటే సమస్య రెండు వైపులా ఉంది.ఒకవైపు ప్యాకెట్‌లో అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు.. మరోవైపు కల్తీ, నాణ్యత లోపాలు, లేబులింగ్ ఉల్లంఘనలు.అందుకే ఫుడ్ సేఫ్టీని అప్పుడప్పుడు చేసే తనిఖీలుగా చూడటం సరిపోదు.

### ప్యాకెట్ బయట కనిపించేది కాదు.. లోపల ఉన్నదే ముఖ్యం

ప్యాకెట్‌పై పెద్ద అక్షరాలతో 'హెల్తీ', 'నేచురల్', 'న్యూట్రిషియస్' అని రాస్తే అది నిజంగా ఆరోగ్యకరమైన ఆహారమేనా?రంగురంగుల ప్యాకేజింగ్, కార్టూన్ బొమ్మలు, సెలబ్రిటీలు, ఆకర్షణీయమైన ప్రకటనలు పిల్లలను ఆకట్టుకోవచ్చు. కానీ చివరకు ఆ ప్యాకెట్‌లో ఉన్న పదార్థాలు శరీరంలోకి వెళ్తాయి.అందుకే ప్రకటనలపై నియంత్రణ, ప్యాకెట్‌పై స్పష్టమైన సమాచారం, తయారీ నాణ్యత, నిరంతర తనిఖీలు, శాస్త్రీయ పరీక్షలు, ఉల్లంఘనలకు కఠినమైన శిక్షలు— అన్నీ ఒకేసారి అవసరం.ప్యాకెట్‌పై హెచ్చరిక పెట్టడం కంపెనీలను శిక్షించడం కాదు.వినియోగదారుడికి నిజం చెప్పడం.

### ఆరోగ్యాన్ని కూడా మార్కెట్ నిర్ణయించాలా?

ప్రజల ఆరోగ్యం ఒక వ్యాపార వస్తువు కాదు. ఒక కంపెనీకి ఒక ఉత్పత్తి లాభదాయకంగా ఉండొచ్చు. కానీ అదే ఉత్పత్తి ప్రజల ఆరోగ్యానికి హానికరమైతే ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిందే.ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత ఆసుపత్రులు పెంచడం కంటే.. అనారోగ్యానికి దారితీసే కారణాలను ముందే నియంత్రించడం మేలు.ఒకవైపు ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తూ.. మరోవైపు అనారోగ్యకరమైన ఆహార మార్కెట్‌పై కఠిన నియంత్రణకు వెనుకాడితే అది విధాన వైరుధ్యం కాదా?

### ఇకనైనా మేల్కొనాలి

తాజాగా FSSAI సుప్రీంకోర్టు ముందు అధిక చక్కెర, ఉప్పు, సాచురేటెడ్ ఫ్యాట్ ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్స్‌పై ఎరుపు రంగు హెక్సాగన్ ఆకారపు హెచ్చరిక గుర్తులు పెట్టే ప్రతిపాదనను ఉంచింది.ఇది మంచి ముందడుగే.కానీ అసలు ప్రశ్న ఇంకా మిగిలే ఉంది.సుప్రీంకోర్టు నిలదీసే వరకు ఎందుకు?ప్రజల ఆరోగ్యం కోసం పనిచేయాల్సిన నియంత్రణ సంస్థలు ముందుగానే స్పందించలేవా? ఇతర దేశాలు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించి మన దేశానికి సరైన విధానాన్ని వేగంగా తీసుకురాలేవా?ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన నిర్ణయం తీసుకోవడానికి కోర్టు గుర్తు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?ఇకపై ఈ ప్రశ్నకు సమాధానం ప్రభుత్వాలే ఇవ్వాలి.కంపెనీలకు వ్యాపారం ముఖ్యం కావచ్చు. ప్రభుత్వాలకు పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు ముఖ్యం కావచ్చు. ఇవన్నీ దేశ అభివృద్ధికి అవసరమే.

### కానీ..

ఆరోగ్యవంతమైన ప్రజలు లేకుండా అభివృద్ధికి అర్థమేంటి?ప్యాకెట్ రంగు ఆకర్షణీయంగా ఉండొచ్చు. ప్రకటన అద్భుతంగా ఉండొచ్చు. ధర తక్కువగా ఉండొచ్చు. కానీ చివరకు ఆ ప్యాకెట్ మనిషి శరీరంలోకి వెళ్తుంది.

### అందుకే..

"ప్యాకెట్ అమ్ముడవ్వడం కంటే.. ప్యాకెట్ తిన్న మనిషి ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యం."ప్రజలకు నిజం చెప్పే విషయంలో ప్రభుత్వాలు ఇక ఆలస్యం చేయకూడదు. కంపెనీల ఒత్తిడికి కాదు.. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి.ప్యాకెట్‌పై ఎర్రగుర్తు పడటం కంటే.. ప్రభుత్వ విధానాల్లో ప్రజారోగ్యానికి మొదటి స్థానం దక్కడం ముఖ్యం.సుప్రీంకోర్టు చెప్పే వరకు వేచి చూడాల్సిన అవసరం లేని విషయాన్ని.. ఇకనైనా ప్రభుత్వాలు స్వయంగా అర్థం చేసుకోవాలి.

**సాయి మణికంఠ**
**మేనేజింగ్ ఎడిటర్**
**నవజ్యోతి తెలుగు దినపత్రిక**

## సహచర కౌన్సిలర్లకు రాఖీ కట్టిన చైర్‌పర్సన్ ఉమారాణి



కామారెడ్డి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): రక్షాబంధన్ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సహచర కాంగ్రెస్ కౌన్సిలర్లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధాలకు ప్రతీక అని ఆమె అన్నారు. సోదర సోదరీమణుల మధ్య ఆప్యాయత, అనురాగాలు ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు అంజాద్, బబ్లు, మాజీద్, జావేద్, సాయిలు సిద్ధిక్, చిట్టిబాబు, కల్లెం సత్యం, యూనస్, అస్రార్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడల్లో భిక్కనూర్ విద్యార్థినుల ప్రతిభ



భిక్కనూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): దోమకొండ మండలం గాడికోటలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో భిక్కనూర్‌కు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్–16 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో మనుశ్రీ రజత పతకం, అండర్–18 విభాగం 100 మీటర్ల పరుగు పందెంలో శ్రీనిధి స్వర్ణ పతకం సాధించారు.విద్యార్థినులను పీడీ నర్సింహారెడ్డి, కోచ్ దేవుని భరత్ అభినందించారు.

## భిక్కనూరులో సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు



భిక్కనూరు, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): భిక్కనూర్ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారి వెంట సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ తెలిపారు. శనివారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌తో కలిసి సిద్ధిరామేశ్వర ఆలయానికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపడతామని ఎంపీ హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ లింబాద్రి, సర్పంచ్ రేఖ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, గ్రామ పాలకవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు: షబ్బీర్ అలీ

**✻ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణ✻**



కామారెడ్డి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్ లబ్ధిదారులకు కార్డులు అందజేశారు.షబ్బీర్ అలీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులతో నిత్యావసర సరుకులతో పాటు పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందవచ్చన్నారు.ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రాణి రాజు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ డీసీసీబీ అధ్యక్షుడు ఎడ్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్, గ్రామ వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్, సొసైటీ చైర్మన్లు భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ లింబాద్రి, సర్పంచులు రేఖ, కృష్ణారావు, లింగరెడ్డి, సంతోష్, సీనియర్ నాయకులు విజయ్‌గౌడ్, మహిపాల్, రాజబాబు, అంకం రాజు, యాదవరెడ్డి, స్వామి, దయాకర్‌రెడ్డి, పండ్ల రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, శ్రీకాంత్, కోటను స్వామి, రాకేష్, సతీష్, ధర్మయ్య, కిరణ్, సురేష్, పాత్రికేయులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రామేశ్వర్‌పల్లి పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**✻ రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: షబ్బీర్ అలీ**





కామారెడ్డి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్మన్‌గా టీపీసీసీ జనరల్ సెక్రెటరీ బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు.షబ్బీర్ అలీ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పీఏసీఎస్‌లు రైతులకు రుణాలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా పనిచేయాలని సూచించారు. నూతన పాలకవర్గం రైతులకు రాజకీయాలకు అతీతంగా సేవలందించాలన్నారు. ఎంపీ సురేష్‌కుమార్ షట్కర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు గ్రామస్థాయిలోనే సేవలు అందేలా పీఏసీఎస్‌లు పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మాజీ డీసీసీబీ అధ్యక్షుడు ఎడ్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, ఇరేని సందీప్, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హాకీ స్టిక్‌గా విద్యార్థుల మానవహారం

**✻ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వినూత్న నివాళి**



కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సూరారం కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్‌కు వినూత్నంగా నివాళులర్పించారు. సుమారు 70 మంది విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టి హాకీ స్టిక్ ఆకారంలో మానవహారంగా నిలిచి, మధ్యలో హాకీ బంతిని ఏర్పాటు చేశారు.పాఠశాల పీడీ నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని విద్యార్థులకు వివరించారు.

## వెల్దుర్తి–మెదక్ రోడ్డుపై బీఆర్ఎస్ డ్రామాలు: కాంగ్రెస్ నేతలు

✻ ఆగస్టు 31 పాదయాత్రపై కాంగ్రెస్ నేతల విమర్శలు



వెల్దుర్తి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): వెల్దుర్తి–మెదక్ రోడ్డు విషయంలో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమన్నగారి నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గొంగిరెడ్డి మహేష్‌రెడ్డి విమర్శించారు. వెల్దుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రోడ్డును పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.ఆగస్టు 31న బీఆర్ఎస్ చేపట్టనున్న మహా పాదయాత్ర పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, రాష్ట్ర ఫిషర్మెన్ కార్యదర్శి తలారి మల్లేష్, కాంగ్రెస్ నాయకులు శేకాగౌడ్, దుర్గాగౌడ్, పోతిరెడ్డి నరేందర్‌రెడ్డి, హన్మేష్, మండల యువజన అధ్యక్షుడు తలారి ప్రేమ్‌కుమార్, యువ నాయకుడు అక్షయ్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.<

## సింగీతం, నర్వ కాలువల మరమ్మతులకు రూ.1.31 కోట్లు

✻ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



జుక్కల్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): మహమ్మద్‌నగర్ మండలంలోని సింగీతం రిజర్వాయర్ రిటైనింగ్ వాల్, నర్వ పాత చెరువు పంట కాలువ మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.31 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. సింగీతం రిటైనింగ్ వాల్‌కు రూ.83.50 లక్షలు, నర్వ పంట కాలువకు రూ.48 లక్షలు కేటాయించారు.నిధుల మంజూరుపై మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ నిధులు మంజూరు చేయించిన సీఎం, ఎమ్మెల్యేలకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పనులను త్వరగా ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు.కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగి రమేష్, సర్పంచులు సాయికిరణ్, భోయిని హరిన్‌కుమార్, కుమ్మరి రాములు, గజ్జెల జీవన్, నాయకులు మల్లయ్యగారి ఆకాష్, లోక్య నాయక్, సవాయి సింగ్, కాశయ్య, అథిక్, ఇఫ్తేకార్, రామగౌడ్, గోపి సింగ్, సాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 125 రోజుల పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి: సర్పంచ్ దున్నా శ్రీనివాస్



నడిగూడెం, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): వి.బి.జి. రాంజీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు 125 రోజుల పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పథకంపై తొలి గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కూలీలకు ముందస్తుగా పనులు గుర్తించి 125 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు దున్నా లింగయ్య, దున్నా మనీషా, కాసాని గోపీనాథ్, షేక్ రియాజ్, సాంకేతిక సహాయకుడు అంజిరెడ్డి, క్షేత్ర సహాయకురాలు పద్మ, ఉపాధి కూలీలు గుండు వెంకన్న, షేక్ జలీల్, దున్న అలివేలమ్మ, గుండు శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల భూ మోసం.. రౌడీషీటర్ అరెస్ట్

✻ స్థలం ఇప్పిస్తానంటూ నగదు తీసుకుని మో సం



కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): స్థలం ఇప్పిస్తానంటూ రూ.3 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా, నగదును తిరిగి ఇవ్వలేదన్న ఫిర్యాదుతో రియల్ ఎస్టేట్ వ్యాపారి మజర్ ఖాన్ (51)ను సూరారం పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. 2019లో కైసర్‌నగర్‌లో 80 చదరపు గజాల స్థలం విక్రయిస్తానని మజర్ ఖాన్ రామ తులసిని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నాడు. స్థలం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు నగదు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. దీంతో క్రైమ్ నం.621/2026లో బీఎన్ఎస్ 318(4) రెడ్‌విత్ 316(2) కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. కోర్టు రిమాండ్ విధించింది.మజర్ ఖాన్‌పై మియాపూర్, జీడిమెట్ల, సూరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలో 9 కేసులు ఉన్నాయని, బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భూమి కొనుగోలులో పత్రాలు, యాజమాన్య హక్కులు, రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలించిన తర్వాతే నగదు చెల్లించాలని సూరారం ఎస్‌హెచ్‌ఓ బాలరాజు సూచించారు.

# కెమికల్ వ్యర్థాలు అక్కడే.. 21 రోజులైనా చర్యలేవీ?

✻ పీసీబీ పరిశీలించినా తరలింపు చర్యలు శూన్యం





కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని ఎస్వీ కో–ఆపరేటివ్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో పడేసిన కెమికల్ వ్యర్థాల సమస్యపై 21 రోజులు గడిచినా చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవజ్యోతి కథనంతో పీసీబీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించినా వ్యర్థాలు మాత్రం అక్కడే ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.వ్యర్థాల నమూనాలు సేకరించారా? వాటి పరీక్ష ఫలితాలు ఏమిటి? అవి ఏ పరిశ్రమకు చెందినవి? ఎవరు అక్కడ పారబోశారు? అనే వివరాలు వెల్లడించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు. సమీపంలోని పరిశ్రమల రికార్డులు, వ్యర్థాల తరలింపు వివరాలు, సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.వ్యర్థాలను సురక్షితంగా తొలగించడంతో పాటు వాటిని అక్కడికి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

✻ అన్ని శాఖల సమన్వయంతో వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి



కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితి, గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు దుండిగల్ సర్కిల్ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. దుండిగల్ సర్కిల్–59 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.నిమజ్జన ఘాట్ల వద్ద లైటింగ్, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలపై సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా విపత్తు నిర్వహణ, హైడ్రా బృందాలను సిద్ధంగా ఉంచాలని డీసీ ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎం ఏఈ అశోక్‌కుమార్, ఏఎంసీ లక్ష్మయ్య, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఏఈ రవి, దుండిగల్ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ సిరాజ్, దుండిగల్ ఎస్ఐలు, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, పోలీస్, ఫైర్, వైద్య, జలమండలి, టీజీఎస్‌పీడీసీఎల్, రవాణా, ఆర్టీసీ, హైడ్రా, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరి, పత్తి పంటలకు చీడపీడల ముప్పు



పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): పాలకుర్తి మండలం పుట్నూర్‌లో వరి, పత్తి పంటలను శనివారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. కూనారం వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ సతీష్‌చంద్ర, పెద్దపల్లి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ఓ. సంపత్ నేతృత్వంలో పొలాలను పరిశీలించి రైతులకు నివారణ చర్యలు సూచించారు.వరిలో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, పత్తిలో తామర పురుగులు, పచ్చదోమ ఆశించినట్లు గుర్తించారు. రైతులు పొలాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పరిమిత మోతాదులో పురుగుమందులు వినియోగించాలని శాస్త్రవేత్తలు సూచించారు. పుట్నూర్ సర్పంచ్ తోట ప్రశాంత్, వ్యవసాయ అధికారి బండి ప్రమోద్‌కుమార్, ఏఈఓ కె. శ్రీకాంత్, శాస్త్రవేత్త డాక్టర్ శరత్‌చంద్ర, రైతులు పాల్గొన్నారు.

## కామారెడ్డి కౌన్సిల్ భేటీలో వాడీవేడి

✻ బీఆర్ఎస్, బీజేపీ నిరసనలతో గందరగోళం.. 9 అంశాలకు ఆమోదం



కామారెడ్డి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి) : కామారెడ్డి మున్సిపల్ అత్యవసర సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా జరిగింది. వార్డుల్లో అభివృద్ధి పనులపై తమకు సమాచారం ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు పోడియం వద్ద నిరసనకు దిగారు. సమాచారం ఇవ్వకపోతే పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చరించారు.మరోవైపు బీజేపీ కౌన్సిలర్లు సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కుర్చీలు ధ్వంసమైనట్లు సమాచారం. మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు కాంగ్రెస్ కౌన్సిలర్లు సహకరిస్తున్నారని బీజేపీ సభ్యులు ఆరోపించారు.నిరసనలు, వాగ్వాదం మధ్య సమావేశంలో 9 ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ప్రతి వార్డుకు రూ.6 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు కేటాయించాలని నిర్ణయించారు. అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం






నర్సాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): ప్రముఖ భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని విష్ణు ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వారం రోజులుగా వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక, శారీరక ఉల్లాసాన్ని అందించడంతో పాటు ప్రతిభను వెలికితీస్తాయని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, రమేష్, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై సెప్టెంబర్ 2 నుంచి ఇంటింటికీ బీఆర్ఎస్

✻ ప్రజా సమస్యలపై పోరాటానికి ఎమ్మెల్యేస్ణరావు పిలుపు





కూకట్‌పల్లి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు.ఎస్ఐఆర్ అంశంపై ప్రజల సందేహాలను నివృత్తి చేసి, జాబితాలో గల్లంతైన అర్హుల ఓట్లను తిరిగి నమోదు చేయించేలా పనిచేయాలని సూచించారు. 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా సమస్యలపై ప్రజలకు అండగా నిలవాలని అన్నారు.సెప్టెంబర్ 2న బోయినపల్లి, 4న బాలానగర్, 5న బేగంపేట, 6న ఫతేనగర్, 7న మూసాపేట్, 8న అల్లాపూర్, 9న బాలాజీనగర్–కేపీహెచ్‌బీ, 10న కూకట్‌పల్లి డివిజన్లలో నిరసన సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ 'బాకీ కార్డులు' పంపిణీ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, తూము శ్రవణ్‌కుమార్, పందాల సతీష్‌గౌడ్, పగడాల బాబూరావు, ఎండీ సబిహా గౌసిద్దీన్, మహేశ్వరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీపీ ప్లాంట్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



కూకట్‌పల్లి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): బాలాజీనగర్ రెయిన్‌బో విస్టాస్ సమీపంలోని ఎస్టీపీ ప్లాంట్ వల్ల స్థానికులకు ఇబ్బందులు లేకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్లాంట్ నుంచి వస్తున్న దుర్వాసన, భారీ శబ్దాలపై ఫిర్యాదులు రావడంతో శనివారం అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఫతేనగర్, కేపీహెచ్‌బీ ఎస్టీపీ ప్లాంట్లలో లేని సమస్యలు ఇక్కడ ఎందుకు ఏర్పడుతున్నాయో గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరిశీలనలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత షూస్ పంపిణీ



పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత షూస్‌ను అంతర్గాం పరిధిలోని స్థానిక ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఆంబోతు రవి, ఉపసర్పంచ్ ఉష, వార్డు సభ్యుడు కుర్ర రిషి, స్కూల్ చైర్మన్ సురువాని విద్యార్థులకు షూస్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదవాలని సూచించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల ఫోకస్

* చెరువులు, బేబీ పాండ్‌ల వద్ద పరిశీలన



కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జీడిమెట్ల సర్కిల్ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. సర్కిల్–55 పరిధిలోని జీడిమెట్ల విలేజ్ వెన్నెలగడ్డ చెరువు, కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం సమీపంలోని హెచ్ఎంటీ ఓపెన్ ప్లేస్‌లో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక బేబీ పాండ్‌లను వివిధ శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు.నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు, బారికేడ్లు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, తాత్కాలిక మరుగుదొడ్లు, రహదారుల మరమ్మతులు, నిర్వహణపై సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.పోలీసు, ట్రాఫిక్, ఎలక్ట్రికల్, వాటర్‌వర్క్స్, ఫైర్, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను సమీక్షించారు.

## సీఈఐఆర్ పోర్టల్‌తో 98 ఫోన్లు రికవరీ

* రూ.15.50 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత



కూకట్‌పల్లి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాలానగర్ డివిజన్ పరిధిలోని పోలీసులు రూ.15.50 లక్షల విలువైన 98 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కూకట్‌పల్లి పోలీసులు 65, బాలానగర్ పోలీసులు 30, అల్లాపూర్ పోలీసులు 3 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో, బాలానగర్ ఏసీపీ పి. నరేష్‌రెడ్డి నేతృత్వంలో సీఐలు, డీఐలు, క్రైమ్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను గుర్తించారు. ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది జకీర్, వెంకటేష్, లక్ష్మప్ప, ఆజంలకు రివార్డులు అందజేశారు.ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఐఎంఈఐ నంబర్‌తో బ్లాక్ చేయించాలని ఏసీపీ నరేష్‌రెడ్డి సూచించారు.

## బౌరంపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

* ప్రభుత్వ స్థలాల్లో షట్టర్లు, భవనంపై అధికారుల చర్యలు



కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టారు. పార్కు పక్కన ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన షట్టర్లను జేసీబీతో తొలగించారు. అదే ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మరో భవనాన్ని గుర్తించి కూల్చివేశా రు.అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకపోవడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, భవన నిర్మాణ నిబంధనలు ఉల్లంఘించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చర్యల్లో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరన్, ఏసీపీ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణారావు భూకబ్జాలపై బహిరంగ చర్చకు సిద్ధమా?

* టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సవాల్




కూకట్‌పల్లి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హెచ్చరించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కృష్ణారావు హయాంలో చెరువులు, నాలాలు, కుంటలు కబ్జాకు గురయ్యాయని బండి రమేష్ ఆరోపించారు. హస్మత్‌పేట సర్వే నంబర్ 1లోని 100 ఎకరాల్లో 10 ఎకరాలు మాత్రమే మిగిలాయని, అల్లాపూర్, గోపాల్‌నగర్‌లో ఖాళీ స్థలాలు ఆయన అనుచరుల ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. కృష్ణారావు మొదటిసారి కౌన్సిలర్‌గా ఉన్నప్పటి ఆస్తులు, ప్రస్తుత ఆస్తులపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.22ఏ అంశంపై సానుభూతి కోసం నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత, ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని బండి రమేష్ తెలిపారు.

# ధాన్యం గోదాముల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

* జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం నిల్వ గోదాముల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ ధాన్యం నిల్వ పథకం కింద మెదక్ జిల్లాకు 30 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్య లక్ష్యం కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. లక్ష్యానికి అనుగుణంగా అనువైన పీఏసీఎస్‌లను గుర్తించి గోదాముల నిర్మాణం చేపట్టాలని సూచించారు. గోదాములు అందుబాటులోకి వస్తే రైతులు పంటను స్థానికంగానే నిల్వ చేసుకుని, ధరలు అనుకూలంగా ఉన్నప్పుడు విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు.వెల్దుర్తి, రంగంపేట పీఏసీఎస్‌లలో గోదాముల నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు. కొత్తపల్లి ఎఫ్ఎస్‌సీఎస్, కల్వకుంట, చీకోడు పీఏసీఎస్‌లకు భూ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎఫ్‌సీఐ నిబంధనలు, భౌగోళిక పరిస్థితులు, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అంబదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, అదనపు డీఆర్డీవో సరస్వతి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

మెదక్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మెదక్ జిల్లా కేంద్రంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్నింగ్ పోటీల్లో విద్యార్థులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వెల్కమ్ బోర్డు చౌరస్తా నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు పురుషులకు 5 కిలోమీటర్లు, కొత్త బస్టాండ్ నుంచి ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు బాలికలకు 2 కిలోమీటర్ల రన్నింగ్ పోటీలను కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.అనంతరం ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 5 కిలోమీటర్ల రన్నింగ్‌లో మెదక్ పట్టణ సీఐ మహేష్ పాల్గొని పోటీని పూర్తి చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు జుబేర్ అహ్మద్, చైర్మన్ శివ, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, ఎస్జీఎఫ్



కార్యదర్శి నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే పోలీసు శాఖకు గౌరవం

* వారాంతపు పరేడ్‌ను పరిశీలించిన డీఎస్పీ ప్రసన్న కుమార్





మెదక్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, అప్రమత్తతకు ప్రాధాన్యత ఇవ్వాలని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పోలీసు సిబ్బందికి సూచించారు. శనివారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వారాంతపు పరేడ్‌ను ఆయన పరిశీలించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా, అంకితభావంతో విధులు నిర్వహించాలని డీఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసు శాఖపై నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గాభవాని ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): సూరారం డివిజన్ శివాలయ నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ దుర్గాభవాని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, విశ్వకర్మ కాలనీ అధ్యక్షుడు కొండకళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు కొనసాగగా, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, స్థానికులు శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు.కార్యక్రమంలో అశోక్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మోసాలపై కదం తొక్కాలి: పుట్ట మధూకర్



పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు.మంథని పట్టణంలోని రాజగృహాలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించి పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు ప్రతి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఓట్ల సమయంలో ఇచ్చిన గ్యారెంటీ కార్డులను ఇప్పుడు 'బాకీ కార్డులు'గా ప్రజలకు చూపిస్తూ ప్రభుత్వ వైఫల్యాల ను ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను గల్లీ గల్లీలోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, వారం రోజుల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని పుట్ట మధూకర్ సూచించారు.

# జాతీయ క్రీడా దినోత్సవంలో క్రీడాకారులకు సన్మానం



*** క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం: అదనపు కలెక్టర్ పాండు**

సంగారెడ్డి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమాన్ని జిల్లా యువజన, క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పాండు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు కేవలం వినోదం మాత్రమే కాదని, మానసిక ఆరోగ్యం, ఉల్లాసం, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు.

నేషనల్ ప్లేయర్ మహమ్మద్ జావిద్ అలీ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా ప్రతిభ, హాకీలో భారత్‌కు సాధించిన విజయాలను వివరించారు. మరో అతిథి కూన వేణు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో దేశానికి పేరు తీసుకురావాలని కోరారు.

ఈ సందర్భంగా ఖేలో ఇండియాలో జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన కొర్రరాజు, జూడో చరణ్, కె. గీతలను సన్మానించారు.

కార్యక్రమంలో సీనియర్ హాకీ కోచ్ సాయికుమార్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి. శంకర్, రెజ్లింగ్ కోచ్ జైపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గ ప్రసాద్, సుభాష్ గౌడ్, రామకృష్ణ, రామగౌడ్, కృష్ణయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్, కరాటే అసోసియేషన్ చవాన్ చందర్, బాక్సింగ్ అసోసియేషన్ మహేష్, రెజ్లింగ్ అసోసియేషన్ విట్టల్ నాయక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలి




* అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకుని పనులు చేపడతాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):
ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. శనివారం ఆలయ పునర్నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆగమ శాస్త్రం ప్రకారం ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందన్నారు. అగ్రహారం బ్రాహ్మణులు, వేద పండితులు, పట్టణ ప్రజల అభిప్రాయాలు తీసుకుని పనులు చేపడతామని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆలయ పరిసరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.


బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించామని, మరో రూ.40 కోట్లతో బైపాస్ రోడ్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి నిధులు విడుదల కానున్నాయని తెలిపారు.

దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని రూ.10 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. యోగ నరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు నిర్వహిస్తామని చెప్పారు.

సమీక్ష సమావేశంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, వేద పండితులు, స్థానికులు పాల్గొన్నారు.

# రావల్కోల్‌లో క్రషర్ ఏర్పాటుపై రైతుల నిరసన

**అంబేద్కర్‌కు లేఖ రాసిన రైతులు.. అనుమతులపై సమగ్ర విచారణకు డిమాండ్**



మేడ్చల్, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):
ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రావల్కోల్ గ్రామంలో క్వారీ, క్రషర్ ఏర్పాటుపై రైతుల నిరసన కొనసాగుతోంది. 111 సర్వే నంబర్లలో క్రషర్ ఏర్పాటును అడ్డుకోవాలనిy కోరుతూ రైతులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు లేఖ రాశారు.

క్రషర్ ఏర్పాటుపై గతంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామ ప్రజలు, రైతులు వ్యతిరేకత వ్యక్తం చేశారని రైతులు తెలిపారు. అయినా పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. క్రషర్ కార్యకలాపాలతో వ్యవసాయం, పర్యావరణం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

క్రషర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రెండు నెలలుగా శాంతియుతంగా నిరసన దీక్షలు చేస్తున్నామని తెలిపారు. తమ ఆందోళనను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

111 సర్వే నంబర్లలో క్రషర్‌కు ఉన్న అనుమతులు, పర్యావరణ నిబంధనలు, భూముల స్వరూపంపై సమగ్ర విచారణ జరపాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని చట్టబద్ధమైన పరిష్కారం చూపాలని కోరారు.

# మావేశానికి రాని నేతలపై జగ్గారెడ్డి ఫైర్



**ఇంట్లో కూర్చొని రాజకీయాలు చేసేవారిని కమిటీల్లోకి తీసుకోవద్దు**

సంగారెడ్డి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):
సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పార్టీ నాయకుల గైర్హాజరుపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్ మండలాల పార్టీ కమిటీలను ప్రకటిస్తున్న సమయంలో లిస్టులో పేరున్న పలువురు నాయకులు సమావేశానికి హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడి ఎంగేజ్‌మెంట్ మరో రెండు రోజుల్లో ఉన్నప్పటికీ ఉదయం 11 గంటలకే సంగారెడ్డికి వచ్చానన్నారు. ఇంట్లో శుభకార్యం ఉంటే అందరూ ఏర్పాట్లలో ఉంటారని, అయినా తాను పార్టీ సమావేశానికి హాజరయ్యానని తెలిపారు. రాజకీయాలపై ఆసక్తి, ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్నవారినే పార్టీ కమిటీల్లోకి తీసుకోవాలని సూచించారు.

ఇంట్లో కూర్చొని రాజకీయాలు చేసేవారిని కమిటీల్లోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరుకాని వారిని వెంటనే కమిటీల నుంచి తొలగించి, సమావేశానికి వచ్చిన వారి పేర్లను చేర్చాలని కమిటీ అధ్యక్షులను జగ్గారెడ్డి ఆదేశించారు.

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలి



**రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి, ఆగస్టు 29 (నవజ్యోతి ప్రతినిధి):
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. నోటీసులు అందజేసిన తర్వాత తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నోటీసుల పంపిణీ, హియరింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలని, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బీఎల్ఓలకు మార్గనిర్దేశం చేస్తూ పారదర్శకంగా ఓటరు జాబితాలను రూపొందించాలని సూచించారు.అనంతరం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నియోజకవర్గాల వారీగా ఎస్ఐఆర్ పురోగతిని కలెక్టర్ ప్రతీక్ జైన్ సమీక్షించారు. నోటీసుల పంపిణీని ప్రాధాన్యతగా తీసుకుని వేగవంతం చేయాలని, పోలింగ్ స్టేషన్, మండలాల వారీగా రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. నోటీసులు పెండింగ్‌లో ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఇబ్బంది కలగకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంగీత, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.